క్లుప్తంగా

గొల్ల కురుమలు ఆర్థికంగా ఎదగాలి



గొర్రెలు అందజేస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ

టేకులపల్లి: గొల్ల కురుమలు ఆర్థికంగా ఎదిగేందుకు సీఎం కేసీఆర్ వారికి గొర్రెల పంపిణీతో చేయూతనిస్తున్నారని ఇల్లెందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియ అన్నారు. శనివారం పెగళ్లపాడు గ్రామపంచాయతీలో రెండో విడత లబ్ధిదారులకు సబ్సిడీపై గొర్రెలను పంపిణీ చేశారు. మాట్లాడుతూ.. యాదవుల సంక్షేమం అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గొర్రెలను పంపిణీ చేసి వారి అభివృద్ధికి బాటలు వేస్తోందని పేర్కొన్నారు.

యువశక్తి ఆవశ్యకతను గుర్తించండి



ర్యాలీలో పాల్గొన్న యువత

సింగరేణి(కొత్తగూడెం): ప్రపంచ దేశాలన్ని యువశక్తి ఆవశ్యకత గుర్తించాలని, విద్యా ఉపాధి రంగాలు యువతకు చేరువకావాలని డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ కార్యదర్శి కాలంగి హరికృష్ణ అన్నారు. అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా శనివారం కొత్తగూడెం క్లబ్‌లో డీవైఎఫ్ఐ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం లిక్కి బాలరాజు అధ్యక్షతన జరిగింది. హరికృష్ణ మాట్లాడుతూ.. యువశక్తిని గుర్తించి ప్రోత్సహించాలని, యువత సక్రమమార్గంలో పయనించినప్పుడు అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో చంద్రరావు వెంకన్న, వీరభద్రం, మధు తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలను సద్వినియోగం చేసుకోండి

కొత్తగూడెంఅర్బన్: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రధానమంత్రి యశస్వి ఉపకార వేతనాలను ఈబీసీ, ఓబీసీ, డీఎన్టీ వర్గాలకు చెందిన గిరిజన కులాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఎండీ.యాకుబ్‌పాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 9, 10, 11వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ ఉపకార వేతనాలు పొందేందుకు అర్హులని, విద్యార్థులు వారి ధృవీకరణ పత్రాలతో ఆన్‌లైన్‌లో 17వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులైన వారికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ సెప్టెంబర్ 29న పరీక్ష నిర్వహిస్తుందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గురుకుల పాఠశాలలో ఎన్నికలు



ఓటు వేసేందుకు లైన్‌లో ఉన్న విద్యార్థులు

పాల్వంచరూరల్: లక్ష్మీదేవిపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో శనివారం కళాశాల కెప్టెన్, వైస్ కెప్టెన్ ఎన్నిక ప్రకియ రహస్య బాలెట్ విధానం ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో ఫస్ట్ ఇయర్ బైపీసీ విద్యార్థి విఘ్నేష్ కెప్టెన్‌గా ఎన్నికయ్యాడు. పదో తరగతి ఎంఆర్ బాస్‌రావు వైస్ కెప్టెన్‌గా ఎన్నికైనట్లు ప్రిన్సిపాల్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పుల్లారెడ్డి, ఉపాధ్యాయులు సరోజ, రామకృష్ణ, ఎస్‌కే పాషా తదితరులు పాల్గొన్నారు.

టీవీపీఎస్ ఆధ్వర్యంలో 'అయిలూరి' జయంతి

సింగరేణి(కొత్తగూడెం): తెలంగాణ విభిన్న ప్రతిభావంతుల సంఘం (టీవీపీఎస్) ఆధ్వర్యంలో శనివారం దివంగత దివ్యాంగ ఇంజనీర్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మాజీ అధ్యాపకులు, టీవీపీఎస్ మొదటి సభ్యులు అయిలూరి సత్యనారాయణరెడ్డి 61వ జయంతిని కొత్తగూడెంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గుండపనేని సతీష్ మాట్లాడుతూ.. దివ్యాంగుడిగా పుట్టిన సత్యనారాయణరెడ్డి ఉన్నత విద్యనభ్యసించి ఆర్కిటెక్చర్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించారన్నారు. కొత్తగూడెంలో నిర్మించిన చర్చి ఆయన ప్రతిభకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, మేడి ప్రవీణ్‌కుమార్, జగ్గుదాస్, కలబాబు, కరుణాకర్, చాంద్‌పాషా, ఐజయ్య తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన అభివృద్ధి పనులు

వెనక్కి మళ్లిన నిధులు
- ఆర్ఎంఎస్ఏ నిధులు రూ.కోటి మంజూరు
- ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి కాని అదనపు తరగతి గదుల నిర్మాణం



పాపకొల్లు హైస్కూల్‌లో నిలిచిన అదనపు తరగతి గదుల నిర్మాణం



వరండాలో పాఠం చెబుతున్న ఉపాధ్యాయురాలు



పడమటనర్సాపురంలో...

జూలూరుపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో సరిపడా తరగతి గదులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతుండటంతో ప్రభుత్వం అదనపు తరగతి గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ (ఆర్ఎంఎస్ఏ) నిధులు రూ.కోటి వ్యయంతో పాపకొల్లు, జూలూరుపాడు, పడమటనర్సాపురం హైస్కూళ్లలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి 2021లో వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ శంకుస్థాపన చేశారు. కానీ నెలలు, సంవత్సరాలు గడుస్తున్నా పనులు నత్తనడకన సాగుతున్నాయి. పాపకొల్లు హైస్కూల్‌లో అదనపు తరగతి గదుల భవనానికి ప్లాస్టింగ్ కూడా పూర్తి కాలేదు. పడమటనర్సాపురంలో భవనానికి ప్లాస్టింగ్, తలుపులు, కిటికీలనను అమర్చారు కానీ, ఫ్లోరింగ్, విద్యుత్ పనులు చేయాల్సి ఉంది. జూలూరుపాడులో పనులు పూర్తయ్యాయి కానీ ప్రారంభించలేదు. పాపకొల్లు హైస్కూల్‌లో ఎస్ఎంసీ కమిటీ చైర్మన్, జూలూరుపాడు, పడమటనర్సాపురంలలో ఎస్ఎంసీ తీర్మానంతో కాంట్రాక్టర్లు పనులు చేస్తున్నారు. కానీ గడువు లోపల నిర్మాణ పనులు పూర్తికాక పోవడంతో జూలూరుపాడు హైస్కూల్ రూ.3.23 లక్షలు, పాపకొల్లు హైస్కూల్ రూ.8.47 లక్షలు, పడమటనర్సాపురం హైస్కూల్ రూ.7 లక్షలు వెనక్కి వెళ్లాయి. అదనపు తరగతి గదుల నిర్మాణాలకు పూర్తిస్థాయిలో నిధులు మంజూరు చేయకపోగా, వచ్చిన నిధులు కూడా తిరిగి వెనక్కు వెళ్లడంతో ఆయా పాఠశాలల్లో పనులు నిలిచిపోయాయి. చేసిన పనుల వరకైనా బిల్లులు చెల్లించకపోగా మిగిలిన పనులు ఎలా చేయాలని కాంట్రాక్టర్లు ప్రశ్నిస్తున్నారు. పడమటనర్సాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి నుంచి 10 వరకు తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో 220 విద్యార్థులు ఉన్నారు. ఎనిమిది గదులు మాత్రమే ఉన్నాయి. దీంతో వరండాలో చదువుకోవాల్సిన దయనీయ పరిస్థితి. నాలుగు అదనపు తరగతి గదులు మంజూరైనప్పటికీ నిర్మాణ పనులు పూర్తి కాలేదు. మన ఊరు – మన బడి కార్యక్రమం కింద చేపట్టిన పనులు సైతం నత్తనడక కొనసాగుతుండటంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిధులు వెనక్కి వెళ్లాయి



నిధులు వెనక్కి మళ్లడంతో ఎస్ఎంసీ చైర్మన్ పనులు నిలిపేశారు. పనులు సకాలంలో పూర్తి కాకపోవడంతో రూ.8.47 లక్షలు ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. అధికారులు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి.

– బి.బాబులాల్, ఇన్‌చార్జ్ హెచ్ఎం
పాపకొల్లు హైస్కూల్

నిర్మాణం పూర్తయింది



అదనపు తరగతి గదుల భవన నిర్మాణం పూర్తయింది కానీ, పాఠశాలను కాంట్రాక్టర్ అప్పగించలేదు. ఆయనకు ఇంకా రూ 10.73 లక్షలు రావల్సి ఉందని చెప్తున్నారు. విషయాన్ని పైఅధికారులు తెలియజేశాం.

– ఆర్ శ్రీనివాసరావు, హెచ్ఎం
జూలూరుపాడు హైస్కూల్

గదులు లేక ఇబ్బంది పడుతున్నాం



6 నుంచి 10 తరగతులకు 10 గదులు అవసరం ఉండగా.. ఆరు గదుల్లోనే తరగతులు నిర్వహిస్తున్నారు. అదనపు తరగతి గదుల భవన నిర్మాణ పనులు పూర్తి కాలేదు. మరో వైపు మన ఊరు–మన బడి పనులు కొనసాగుతున్నాయి.

– ఎస్ దుర్గా ప్రసాద్, హెచ్ఎం
పడమటనర్సాపురం హైస్కూల్

యాదవులకు ప్రాధాన్యం ఇవ్వండి



సుజాతనగర్: రేవంత్‌రెడ్డిని కలిసిన యాదవ సంఘం నాయకులు

సుజాతనగర్: రాజకీయంగా యాదవులకు ప్రాధాన్యం ఇవ్వాలని యాదవ విద్యా వంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు, టీపీసీసీ సభ్యుడు నాగా సీతారాములు కోరారు. యాదవులకు అన్ని రాజకీయ పార్టీలు ప్రాధాన్యం ఇవ్వాలనే నినాదంతో ఈ నెల 25న హైదరాబాద్‌లో నిర్వహించనున్న యాదవ యుద్ధభేరీ సభ నిర్వహించనున్నారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కలిసి సభకు ఆహ్వానించారు. మాట్లాడుతూ.. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో యాదవులకు 22 ఎమ్మెల్యే, ఏడు ఎమ్మెల్సీలు, మూడు లోక్‌సభ, రెండు రాజ్యసభ టికెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రాష్ట్ర బడ్జెట్‌లో 18 శాతం నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్.లక్ష్మణ్, తోటకూర జంగయ్య, చలకాని వెంకట్, బీర్ల ఐలయ్య, గజ్జి భాస్కర్, తాండ్ర శ్రీనివాస్, రఘురాం మంజులత, లలితకుమారి పాల్గొన్నారు.

ఘనంగా రంగనాథన్ జయంతి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శనివారం ఎస్ఆర్.రంగనాథన్ జయంతి ఘనంగా నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ దిండిగల రాజేందర్ ఆయన చిత్రపటానికి పూలుచల్లి నివాళులర్పించారు. మాట్లాడుతూ.. భారతదేశంలో ఆగస్టు 12న జాతీయ లైబ్రేరియన్ దినోత్సవంగా జరుపుకుంటున్నారని, భారతదేశానికి చెందిన లైబ్రేరియన్, గణిత శాస్త్రవేత్త అయిన రంఘనాథన్ ఇన్ఫర్మేషన్ సైన్స్ పితామహుడిగా పరిగణించబడ్డారని గుర్తు చేశారు. అతని సేవలకు గాను 1957లో పద్మశ్రీ అవార్డును పొందారని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఇన్‌చార్జ్ లైబ్రేరియన్ జి.మణిమృదుల, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసులకు ఫిర్యాదు

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని వేపలగడ్డ గ్రామ పంచాయతీకి చెందిన రైతు నునావత్ భీమా తన మిర్చి నారుపై కొందరు వ్యక్తులు గడ్డి మందు కొట్టారని లక్ష్మీదేవిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఎస్ఐ సతీష్‌ను వివరణ కోరగా.. ఫిర్యాదు వచ్చిందని, విచారణ చేయాల్సి ఉందని తెలిపారు.

ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు

పాల్వంచరూరల్: నాలుగు రోజుల క్రితం ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంపై ఆటో డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

శనివారం ఎస్ఐ కార్తీక్ తెలిపిన వివరాలు... మండలంలోని ఆర్టీఏ చెక్ పోస్ట్ సమీపంలో ఈ నెల 9న చుంచుపల్లి తండాకు చెందిన హరికుమార్ బైక్‌పై పాల్వంచ వస్తుండగా భద్రాచలం వెళ్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో హరికుమార్‌కు తీవ్రగాయాలై ఖమ్మంలో చికిత్స పొందుతున్నాడు. హరికుమార్ భార్య భూక్యా గంగ ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్ హరిబాబుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రారంభానికి సిద్ధమైన పోలీస్ స్టేషన్లు



లక్ష్మీదేవిపల్లిలో కొత్త పోలీసు స్టేషన్

కొత్తగూడెంరూరల్: నక్సల్ ప్రభావిత జిల్లాలో ఉన్న ప్రాంతాల్లో 2020 డిసెంబర్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో తీవ్రవాద ప్రభావిత నిధులు వెచ్చించి రాష్ట్ర పోలీసు హౌజింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో కొత్త పోలీస్‌స్టేషన్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇందులో భాగంగా జిల్లాలో మొత్తం తొమ్మిది పోలీసు స్టేషన్ల నిర్మాణానికి అప్పటి ఎస్పీ సునీల్‌దత్ శంకుస్థాపన చేశారు. ఒక్కో స్టేషన్ నిర్మాణానికి రూ.2.50 కోట్లు కేటాయించారు. ఈ క్రమంలో వెంటనే పనులు ప్రారంభించి తక్కువ సమయంలోనే నిర్మాణాలు పూర్తి చేశారు. లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, సుజాతనగర్, పాల్వంచరూరల్, కిన్నెరసాని, బూర్గంపాడు, దుమ్ముగూడెం, చర్ల, కరకగూడెంలో కొత్త పోలీసు స్టేషన్ల భవనాలు నిర్మించారు. శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో జిల్లా పోలీసు అధికారులు ఆయా పోలీసు స్టేషన్లను ఈ నెల చివరి లేదా వచ్చే నెల మొదటి వారంలో మంత్రులతో ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయించారు.

అన్ని పనులు పూర్తయ్యాయి..



జిల్లాలో తొమ్మిది నూతన పోలీసు స్టేషన్ల భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. లక్ష్మీదేవిపల్లి మండలంలోని స్టేషన్ ప్రారంభానికి రెడీ చేశాం. త్వరలో ఈ పోలీసు స్టేషన్ ప్రారంభమవుతుంది. ఇక్కడికి వచ్చే ప్రజలకు సైతం కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయించాం.

– ఎస్ఐ సంతోష్, లక్ష్మీదేవిపల్లి

వంటావార్పుతో నిరసన

సుజాతనగర్: తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ జూలూరుపాడు, సుజాతనగర్ పీహెచ్‌సీల పరిధిలోని సెకండ్ ఏఎన్ఎంలు స్థానిక ప్రభుత్వాస్పత్రిలో వంటావార్పుతో శనివారం నిరసన తెలిపారు. మాట్లాడుతూ.. 20 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న తమను ప్రభుత్వం రెగ్యులర్ చేయకపోవడం తగదన్నారు. కరోనా కష్టకాలంలో ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహించామని తెలిపారు. తమను క్రమబద్ధీకరణ చేశాకే నోటిఫికేషన్లు వేసి పరీక్షలు నిర్వహించాలన్నారు. ఎప్పటి నుంచో విధులు నిర్వహిస్తున్న తమను అదే ఉద్యోగం కోసం పరీక్ష రాయమనడం సరికాదని, తక్షణమే తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు పద్మజ, రాధ, సంధ్య, వీరమ్మ, పార్వతి, సునీత, సజ్జాబేగం రీనా, సావిత్రి, అనూష, నాగలక్ష్మి, సునీల తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: 15 సంవత్సరాలుగా వెట్టి చాకిరీ చేస్తున్న తమను షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలని రెండో ఏఎన్ఎంలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎనిమిది రోజులు రోజులుగా నిరసన తెలియజేస్తున్న రెండవ ఏఎన్ఎంలు శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సులానగర్‌లో వంటావార్పు నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. చాలీచాలని జీతంతో సేవలందిస్తున్న తమను మానవతా దృక్పథంతో ఆలోచించి ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని విజ్ఞప్తి చేశారు. సీఎం కేసీఆర్ మా మొర ఆలకించాలని విన్నవించారు. కార్యక్రమంలో బి.లక్ష్మి, బి.కృష్ణవేణి స్వప్న, స్రవంతి, లక్ష్మిబాయి, వెంకటరమణ, అరుణాదేవి, అనసూర్య, అరుణకుమారి, మానస, సుజాత, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.



సుజాతనగర్: వంటావార్పుతో నిరసన తెలియజేస్తున్న ఏఎన్ఎంలు



టేకులపల్లి: సులానగర్ పీహెచ్‌సీ ఆవరణలో వంట చేస్తున్న రెండో ఏఎన్ఎంలు

విద్యుత్ లైన్‌కు మరమ్మతులు



రాత్రిపూట మరమ్మతులు చేస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

టేకులపల్లి: టేకులపల్లి మండలం సులానగర్ గ్రామానికి చెందిన సూరేపల్లి వెంకటేశ్వర్లు వ్యవసాయ భూమిలో తన మోటారుకు వెళ్లే విద్యుత్ స్తంభం ఇటీవల కురిసిన వర్షాలకు కుంగిపోయింది. గమనించిన రైతులు స్తంభానికి కర్ర సాయంగా పెట్టారు. ముమ్మరంగా వ్యవసాయ పనులు జరుగుతున్న తరుణంలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి. మళ్లీ వర్షం పడితే సాయంగా పెట్టిన కర్రతో సహా స్తంభం కింద పడిపోయే ప్రమాదం ఉంది. ఈ విషయాన్ని పలువురు స్థానికులు శనివారం బొమ్మనపల్లి సబ్‌స్టేషన్ విద్యుత్ శాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఏఈ పిండిపోలు బుజ్జి కన్నయ్య రాత్రిపూట తన సిబ్బందిని పంపించి ఒరిగిన స్తంభాన్ని సరిచేయించి ప్రమాదాన్ని నివారించారు. రైతులు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

కొనసాగుతున్న చైర్మన్ పర్యటనలు



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న చైర్మన్ డీవీ, కౌన్సిలర్ తార

ఇల్లెందు: మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో సమస్యలు తెలుసుకునేందుకు చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు చేపట్టిన పర్యటనలు కొనసాగుతున్నాయి. శనివారం 24వ వార్డులో ఆయన పర్యటించి సమస్యలపై ఆరా తీశారు. ప్రమాదకరంగా మారిన విద్యుత్ లైన్లు మార్చాలని, మిషన్ భగీరథ కోసం తవ్విన రోడ్ల మరమ్మతు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ కుమారస్వామి, కౌన్సిలర్ వాంకుడోతు తార, రవీందర్, నవీన్, ఆర్ఐ శ్రీనివాస్, టీపీఎస్ సతీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ సిబ్బంది పాల్గొన్నారు. కాగా, చైర్మన్ యాత్రలు శనివారం ఐదో రోజుకు చేరగా, పలు సమస్యల పరిష్కారంపై అక్కడికక్కడే సూచనలు చేస్తున్నారు. ప్రధానంగా పారిశుద్ధ్యం, తాగునీరు, వీధిలైట్లు, రోడ్లు, డ్రెయినేజీలపై ఫిర్యాదులు అందుతుండగా, పింఛన్లు, దళితబంధు, బీసీబంధు తదితర అంశాలపై వినతులు వస్తున్నాయి.

గ్రూప్-2 పరీక్ష వాయిదా వేయాలి



ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న బీఎస్పీ నాయకులు

కొత్తగూడెంఅర్బన్: గ్రూప్–2 పరీక్షను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వాయిదా వేయాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ డిమాండ్ చేశారు. శనివారం పార్టీ శ్రేణులతో కలిసి బస్టాండ్ వద్ద ఉన్న తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద గ్రూపు–2 పరీక్షలను వాయిదా వేయాలన్న డిమాండ్‌తో ప్లకార్డులతో నిరసన తెలిపారు. మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఐదు లక్షల మంది గ్రూపు–2 అభ్యర్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం మొండిగా వ్యవహరించకుండా పరీక్షలు వాయిదా వేయాలన్నారు. ఒక్క ఆగస్టు నెలలోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే 21 పరీక్షలు జరుగుతున్నాయని, వాటిలో గురుకుల ఉపాధ్యాయులు, పాలిటెక్నిక్, జూనియర్ లెక్చరర్ పరీక్షలు కూడా ఉన్నట్లు తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్నాయనే కారణంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులను ఆకర్షించాలని ఒక్క నెలనే ఎంచుకున్నాయని ఆరోపించారు. ఇలా చేయడం వల్ల విద్యార్థులు అగమ్యగోచరంలో పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర పరీక్షలు రాసే అభ్యర్థులు గ్రూపు–2కు సైతం హాజరవుతున్నారని, వేర్వేరు సిలబస్ కలిగిన అభ్యర్థులకు తగిన వ్యవధి ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. పదేళ్లుగా నోటిఫికేషన్లు ఇవ్వకుండా ఇప్పుడు హడావిడిగా పరీక్షలు నిర్వహించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. అభ్యర్థుల ఇబ్బందులను పట్టించుకోకుండా టీఎస్‌పీఎస్సీ మొండిగా వ్యవహరిస్తోందని విమర్శించారు. అన్ని పరీక్షలు పూర్తైన తరువాతే గ్రూపు–2 పరీక్ష నిర్వహించాలన్నారు. నిరుద్యోగులకు న్యాయం జరిగేలా చూడాలని శనివారం గన్‌పార్క్ వద్ద సత్యాగ్రహ దీక్ష చేపట్టనున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్‌ని ముందస్తుగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఎన్ని నిర్బంధాలు విధించినా గ్రూప్–2 అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు వారికి అండగా ఉంటామని, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలకు సైతం సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో గంధం మల్లికార్జున్‌రావు, సాయి, మాలోత్ వీరు, చెనిగారపు నిరంజన్‌కుమార్, అల్లకొండ శరత్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి తోడ్పడండి



జీఎం జాన్ ఆనంద్‌ను సత్కరిస్తున్న ఆదివాసీలు

ఇల్లెందు: అట్టడుగున జీవిస్తున్న గిరిజనుల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొగ్గెల రామస్వామి జీఎం జాన్ ఆనంద్‌ను కోరారు. శనివారం ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్‌ను ఆయన చాంబర్‌లో కలిసి శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

కొమురం భీం గిరిజన సొసైటీ పోరాటాల ఫలితంగా సింగరేణిలో పలు వర్క్‌లు కేటాయించారని, అదే తరహాలో యువతకు మరిన్ని అవకాశాలు కల్పించి సహకరించాలని కోరారు. ఏళ్ల తరబడి గిరిజనులు అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. ఆయన వెంట పొదుగు నారాయణ, చాట్ల అశోక్, సోలం రాములు, పూనెం వెంకటేష్, పూనెం కనకరాజు, చింత నర్సయ్య ఉన్నారు.

విద్యార్థి ఉద్యమాలకు దిక్సూచి ఏఐఎస్ఎఫ్



ఇల్లెందు: జెండా ఆవిష్కరించి నినాదాలు చేస్తున్న హరీష్‌గౌడ్ తదితరులు



జూలూరుపాడులో ఏఐఎస్ఎఫ్ జెండా ఆవిష్కరిస్తున్న నరేంద్రకుమార్

పాల్వంచ: విద్యార్థి ఉద్యమాలకు దిక్సూచి ఏఐఎస్ఎఫ్ అని సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి ఉప్పుశెట్టి రాహుల్ అన్నారు. శనివారం స్థానిక న్యూ చైతన్య కళాశాలలో ఏఐఎస్ఎఫ్ 88వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరించారు. రాహుల్ మాట్లాడుతూ.. విద్యా వ్యతిరేక విధానాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి వి.అజిత్, గుండాల సృజన, శ్రీనివాస్, వినయ్, పవన్, అనిల్, రాకేశ్, హరీశ్, సతీశ్, ప్రియాంక, రమ్య, రోజా, నిరోష, కవిత తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యను వ్యాపారంగా మార్చి పేద, మధ్యతరగతి విద్యార్థులకు దూరం చేస్తున్నాయని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చంద్ర నరేంద్రకుమార్ అన్నారు. శనివారం జూలూరుపాడులో ఏఐఎస్ఎఫ్ 88వ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నరేంద్రకుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్య పరిరక్షణకు విద్యార్థులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గుండెపిన్ని వెంకటేశ్వర్లు, ఎస్కే నాగుల్‌మీరా, ఎస్కే చాంద్‌పాషా, కొండా హనుమంతరావు, రవి కిరణ్, నవీన్, సురేష్, మహేష్, సాయి, చరణ్ పాల్గొన్నారు.

ఇల్లెందు: ఏఐఎస్ఎఫ్ 88వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం పట్టణంలోని జగదాంబా సెంటర్‌లో జెండా ఎగుర వేసి అమరవీరులకు నివాళులర్పించారు. సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు హరీష్‌గౌడ్ మాట్లాడుతూ.. తమ సంఘం ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు నిర్వహించి హక్కులు సాధించుకున్నట్లు చెప్పారు. వినయ్ కల్యాణ్, సాగర్, బబ్లూ, సంపత్, నవీన్ పాల్గొన్నారు.



గత 50 సంవత్సరాలనుండి ఉత్తమ బోధన అంద చేస్తూ లక్షలాది మంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చి దిద్ది తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలలో వ్యాప్తించి వున్న SR విద్యా సంస్థల కోసం ఖమ్మం పట్టణంలో భవనం అద్దె/లీజు కు కావలెను. కాలేజీ మరియు హాస్టల్ లో సుమారు 500-1000 మంది విద్యార్థులకు సరిపోయేంత రెడీ గా వున్న భవనం లేదా స్థలం ఉండి భవనం కట్టించి ఇవ్వగలిగే వారు పూర్తి వివరాలతో సంప్రదించండి.

Mob.: 91211 55002 / 87126 89983

SR Educational Academy
TELANGANA • ANDHRA PRADESH • KARNATAKA